క్లుప్తంగా

358 మందికి కాపు నేస్తం

బల్లికురవ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కాపులకు చేయూతనిచ్చేందుకు ప్రవేశపెట్టిన వైఎస్సార్ కాపునేస్తం పథకంలో మండలంలోని 20 సచివాలయ పరిధిలో 358 మందికి లబ్ధి చేకూరినట్లు ఎంపీడీవో సీహెచ్ కృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగో ఏడాది శనివారం పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలులో మహిళలకు ఖాతాలకు నగదు జమ చేశారన్నారు. రెండు రోజులకు ఆయా ఖాతాలకు సొమ్ము జమ అవుతుందని చెప్పారు.

పేదోడి ఆరోగ్యానికి అండగా ఆరోగ్యశ్రీ



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు

చీరాల: పేద ప్రజల ఆరోగ్యానికి అండగా ఉండటంతో పాటు కార్పొరేట్ వైద్యాన్ని అందించి ప్రాణాలను కాపాడేందుకు ఆరోగ్యశ్రీ సంజీవని అని డాక్టర్ తాడివలస దేవరాజ్ అన్నారు. శనివారం పట్టణంలోని కామాక్షి కేర్ హాస్పిటల్‌లో నిర్వహించిన ఉచిత ఆరోగ్యశ్రీ వైద్య శిబిరం విజయవంతం అయ్యింది. ఈశిబిరంలో ప్రముఖ వైద్యులు కాటూరి శ్యామ్ బాబు, చైతన్య చౌదరిలు శిబిరానికి హాజరైన 101 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్యమిత్ర అనీల్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం



మద్యం బాటిళ్లతో ఎస్సై, పోలీసులు

మార్టూరు: మండలంలోని కోలలపూడి గ్రామంలో శుక్రవారం రాత్రి మార్టూరు పోలీసులు ఓ వ్యక్తి నుంచి అక్రమంగా నిల్వ ఉంచిన ఎనిమిది మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై కే కమలాకర్ వివరాల మేరకు.. కోలలపూడి గ్రామానికి చెందిన తాతా ఏడుకొండలు అక్రమంగా మద్యం వ్యాపారం నిర్వహిస్తున్నాడనే ముందస్తు సమాచారంతో ఎస్సై శుక్రవారం రాత్రి తమ బృందంతో దాడి చేశారు. అందులో భాగంగా ఏడుకొండలు నివాసంలో అక్రమంగా నిల్వఉంచిన బాటిళ్లను స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శింగరకొండ దర్శిని



అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, దక్షిణాయణం, నిజ శ్రావణ మాసం, చిత్త నక్షత్రం, తదియ తిథి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర శనివారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచహారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

మట్టి వినాయక ప్రతిమలే మేలు

చీరాల అర్బన్: పర్యావరణానికి హానికరం లేకుండా ఉండే మట్టి వినాయక ప్రతిమలతోనే వినాయక చవితి జరుపుకోవాలని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ సీహెచ్ రమణమ్మ అన్నారు. వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయక ప్రతిమలను అందరూ ఉపయోగించాలని కోరుతూ శనివారం ర్యాలీ నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థినులు కలిసి మట్టి వినాయక ప్రతిమలను తయారు చేసి, ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనాలతో చేసిన ప్రతిమలు కాకుండా మట్టితో చేసిన ప్రతిమలు పర్యావరణ హితమని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థినులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రంథాలయం ప్రారంభం

చీమకుర్తి: దాతల సహకారంతో మండలంలోని పీ నాయుడుపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ బీ జవహర్, గ్రానైట్ యజమాని చలువాది బదరీనారాయణ చేతుల మీదుగా శనివారం గ్రంథాలయాన్ని ప్రారంభించారు. నాయుడుపాలెం పాఠశాల పూర్వ విద్యార్థి కూరాకుల సిద్ధారెడ్డి ఆర్థిక సహకారంతో గ్రంథాలయానికి కావాల్సిన పుస్తకాలు అందించారు. విద్యార్థులు వారి విద్యా ప్రమాణాలను మెరుగుపరచుకోవాలని డాక్టర్ జవహర్, బదరీనారాయణ తెలిపారు.

మట్టి గణపతితో పర్యావరణ రక్షణ



ముప్పవారిపాలెంలో మట్టి బొమ్మలను తయారు చేసిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

- మట్టి వినాయక విగ్రహాల పంపిణీ
- తగ్గుతున్న ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు

అద్దంకి: ప్రతి ఏడాది వినాయక చవితి పండుగలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఏటికేడు మట్టి వినాయకుల విగ్రహాలు వాడకం ఎక్కువ అవుతోంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ బొమ్మలతో పర్యావరణానికి పెనుముప్పు ఉండటంతో ప్రజల్లో మార్పు కనబడుతోంది. దీంతో ప్రజా సంఘాలు, పలు స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం ఎప్పటికప్పుడూ మట్టి వినాయకులనే వాడండి అని ప్రచారం కల్పించడంతో పాటు ఉచితంగా మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్నారు. అద్దంకి పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవస్థానం వద్ద ఆదివారం సాయంత్రం 5 గంటలకు అద్దంకి మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంగా ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కూరపాటి రామకోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు.

చినగంజాం: మట్టి వినాయకుని పూజిద్దాం, పర్యావరణాన్ని రక్షిద్దాం.. అనే నినాదంతో మండలంలోని ముప్పవారిపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. పాఠశాలలో శనివారం నో బ్యాగ్‌డేని పురస్కరించుకొని హెచ్ఎం మల్లారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. పిల్లలకు ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌చే తయారు చేసిన బొమ్మలకు బదులుగా మట్టి బొమ్మలను వినియోగిస్తే పర్యావరణానికి మేలు జరుగుతుందని ఉపాధ్యాయులు సిద్ధం నాగమల్లేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్ చంద్రశేఖర్, పీ హిమవంతేశ్వరి పాల్గొన్నారు.



మేదరమెట్లలో మండపాల వద్దకు తరలిస్తున్న వినాయక విగ్రహాలు

మండపాలకు తరలుతున్న వినాయకులు..

మేదరమెట్ల: వినాయక చవితి పండుగ సమీపించడంతో గ్రామాల్లో వినాయక విగ్రహాలను మండపాల్లో పెట్టేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకుంటున్నారు. అందులో భాగంగానే మేదరమెట్ల తమ్మవరం రోడ్డులోగల వినాయక విగ్రహాల తయారీ కేంద్రం నుంచి వినాయక విగ్రహాలను క్రేన్‌ల సాయంతో ట్రాక్టర్లలో ఉంచి మండపాలకు తరలిస్తున్నారు. మేళ తాళాలు, బాణా సంచా కాలుస్తూ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్తున్నారు.

ఓజోన్ పొర రక్షణ అందరి బాధ్యత



అద్దంకిలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మోహన్‌రావు



వాడరేవులో ఓ ఆకృతిలో కూర్చొన్న విద్యార్థులు



ఇడుపులపాడులో ఓజోన్ దినోత్సవం గుర్తును ప్రదర్శిస్తున్న విద్యార్థులు

చీరాల అర్బన్: ఓజోన్ పొరను దెబ్బతీసే పదార్థాల వాడకాన్ని తగ్గించుకోవాలని పేరాల ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం బి.సాల్మన్‌రాజు అన్నారు. ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ బోర్డు ఒంగోలు వారి సౌజన్యంతో పేరాల హైస్కూల్‌లో అవగాహన సదస్సును నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన, వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లా ఆప్కాస్ట్ కో-ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి, ప్రొటెక్ట్ సంస్థ కార్యదర్శి శవనం చంద్రారెడ్డి, శ్రీరామమూర్తి, చంద్రశేఖర్, సైన్స్ ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, గాంధీ తదితరులు పాల్గొన్నారు. అలానే చీరాల రూరల్ మండలం వాడరేవులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఓజోన్ పరిరక్షక దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా సైన్స్ అధికారి ఎస్కే సాదిక్ హాజరయ్యారు. అలానే ఓ ఆకృతిలో విద్యార్థులు పాఠశాల ఆవరణలో కూర్చొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలానే పట్టణంలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో ఓజోన్ పరిరక్షణ దితనోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ రమణమ్మ అధ్యక్షత వహించగా పలువురు అధ్యాపకులు ప్రసంగించారు. ఓజోన్ పొర పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతన్నారు.

అద్దంకిలో..

అద్దంకి: పట్టణంలోని కట్టా రామకోటేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శనివారం ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సభకు ప్రిన్సిపాల్ వీ మోహన్‌రావు అధ్యక్షత వహించారు. కార్యక్రమాన్ని వృక్ష, జంతు, రాసాయన శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనిలో భాగంగా వారు ఓజోన్ పొర పరిరక్షణ గురించి, దాన్ని కాపాడుకునే అంశాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, జంతు, వృక్ష, రాసాయన శాస్త్ర అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంకొల్లు (చినగంజాం): ఓజోన్ పొరను రక్షిద్దాం.. భవిష్యత్ తరాలకు మార్గదర్శకం అవుదాం అని ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం పిడవర్తి పేరిరెడ్డి అన్నారు. హెచ్ఎం పేరిరెడ్డి అధ్యక్షతనఅంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం శనివారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పీ పావని, బండారు అనిల్ కుమార్, అంబటి సురేష్,శ్రీ విద్యలక్ష్మి, పీ రాధిక, ఆదినారాయణ, జీ సంధ్యారాణి,కే నర్సయ్య పాల్గొన్నారు.



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

ఎంతమంది కలిసినా వైఎస్సార్ సీపీదే విజయం

- ఏపీ శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

సంతమాగులూరు (అద్దంకి): ఎన్ని పార్టీలు కలసి పోటీ చేసినా రాబోయో ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం తథ్యం అని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. మండలంలోని బండివారిపాలెంలో గ్రామంలో ఆయన శనివారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయన ప్రతి గడపకు వెళ్లి వారిని పలకరించి వారికి ఏఏ పథకాల ద్వారా ఎంత లబ్ధి చేకూరిందో తెలిపే కార్డు అందజేశారు. ప్రభుత్వ పాలన ఎలా ఉంది.. పథకాలు అందుతున్నాయా.. అర్హత ఉన్నా రాని పథకం ఏదైనా ఉందా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ టీడీపీ, జనసేన పొత్తు నేటి కాదని, గతంలోనే వారికి అంతర్గతంగా పొత్తు ఉందన్నారు. ఇప్పుడు కొత్తగా పొత్తు అని చెప్పినా అని కొత్త కాదన్నారు. ప్రజలకు అంతా తెలుసునన్నారు. ఎవరు మేలు చేస్తారో.. వారికే ప్రజలు ఓటు వేసి, మిగిలిన వారికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. నాయకులు, కార్యకర్తలు బాగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. జెడ్పీటీసీ అడవి శ్రీనివాసరావు, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు సక్రమమే



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ అమృతపాణి

చీరాల రూరల్: స్కిల్ స్కామ్ కేసులో చంద్రబాబును సీఐడీ పోలీసులు అరెస్టు చేసిన విధానం సక్రమమేనని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వరికూటి అమృతపాణి అన్నారు. శనివారం స్థానిక అమ్మ కంటి ఆస్పత్రిలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అమృతపాణి మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అనేక కేసులు, ఆరోపణలు ఉన్నప్పటికి వాటన్నింటిని ఎదుర్కొనకుండా స్టేలు తెప్పించుకుని తప్పించుకుని తిరుగుతున్నాడన్నారు. ప్రస్తుతం చంద్రబాబు పాపం పండింది కాబట్టే స్కిల్ స్కాం కేసులో సీఐడీ పోలీసులు అన్ని ఆధారాలు సేకరించి అరెస్టుచేసి రాజమంత్రి జైలులో రిమాండ్ ఖైదీగా కూర్చోబెట్టారని చెప్పారు. పవన్ కళ్యాణ్ కూడా న్యాయ వ్యవస్థపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అలానే రైల్వే స్టేషన్ ఎదురుగా నిర్మిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం విషయంలో అధికారులు ద్వంద్వ వైఖరితో ముందుకు వెళ్లడం సమంజసం కాదన్నారు. వాడరేవుకు చెందిన అర్జిల్లి ప్రసాద్‌కు మత్స్యకారుల సంఘం నాయకుడిగా పదవి వచ్చినందున డాక్టర్ అమృతపాణి ఇతర నాయకులు సమక్షంలో పూలమాలలువేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. సమావేశంలో మాజీ ఎంపీపీ దామర్ల శ్రీకృష్ణ, మాజీ సర్పంచ్ చుండూరి వాసు నాయకులు దేవర పల్లికుమార్ బాబు, సంగుల జాన్ చిరంజీవి, గొట్టిపాటి చిటిబాబు, గుమ్మడి చిన్నబాబు, గోసాల అశోక్, బొంతగర్ల చంద్ర పాల్గొన్నారు.

సమాచారం లేని సర్వసభ్య సమావేశం

- ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రజాప్రతినిధులు



మండల సర్వసభ్య సమావేశంలో అధికారులు

యద్దనపూడి: మండల సర్వసభ్య సమావేశం.. మినీ అసెంబ్లీ సమావేశం లాంటింది. ప్రజా సమస్యల పరిష్కారానికి ఓ ప్రజావేదిక. ప్రతి మూడునెలలకోసారి నిర్వహించే మండల మీట్‌లో ప్రజల ఇబ్బందులను అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించి పరిష్కారం చూపించేందుకు అవకాశం ఉంటుంది. యద్దనపూడి మండల సర్వసభ్య సమావేశం అందుకు విరుద్ధంగా సాగుతోంది. అధికారులు సర్వసభ్య సమావేశం అనే సంగంతి అటు ప్రజాప్రతినిధులకు కానీ, మీడియాకు కానీ సమాచారం ఇవ్వకుండానే ఏదో తూతూ మంత్రంగా ముగించటం ఉన్నతాధికారుల నిర్లక్ష్యానికి అర్థపడుతోంది. శనివారం ఎంపీపీ పులగం రజనీ నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మండలంలోని చాలా శాఖల అధికారుల డుమ్మాకొట్టారు. ఉన్న కొంత మంది అధికారులు ఏదో ప్రగతి నివేదికలు చదివి వినిపించి సమావేశాన్ని ముగించారు. దీంతో మండలంలోని ప్రజలు అధికారుల తీరుపై ఆసహనం వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఎంపీడీఓ కృష్ణకుమారి సర్వసభ్య సమావేశం ఉందన్న విషయం కూడా చెప్పకుండా మమ అనిపించటం పట్ల ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

తీరప్రాంత పరిశుభ్రత సామాజిక బాధ్యత



తీరప్రాంత పరిశుభ్రతపై మాట్లాడుతున్న ఐటీసీ ఫ్యాక్టరీ మేనేజర్

చీరాల టౌన్: పర్యాటకరంగంలో వృద్ధి చెందుతున్న సముద్ర తీర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి సామాజిక బాధ్యతని ఐటీసీ ఫ్యాక్టరీ మేనేజర్ శ్యామ్‌సుందర్ అన్నారు. శనివారం మండలంలోని వాడరేవు గ్రామంలో 'అంతర్జాతీయ సముద్ర తీర పరిశుభ్రత' దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐటీసీ బంగారు భవిష్యత్, ఫీనిక్ష్ సొసైటీ ఆధ్వర్యంలో వాడరేవు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీతో పాటు సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఐటీసీ మేనేజర్ శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ ఆహ్లాదమైన, పరిశుభ్రత కలిగిన సముద్ర తీర ప్రాంతంగా ఉండాలంటే ప్రతి ఒక్కరు తీరప్రాంత పరిశుభ్రతలో పాలుపంచుకోవాలన్నారు. అనంతరం సముద్ర తీరాన్ని శుభ్రంగా ఉంచేలా వ్యర్థాలను తొలగించి బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో హెచ్ఆర్ విజయలక్ష్మి, ఎంపీడీవో నేతాజీ, ఫారెస్ట్ రేంజర్ శ్రీదేవి, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అదుపులో గ్రానైట్ లారీలు

బల్లికురవ: మండలంలోని కొణిదెన రెవెన్యూలోని ఈర్లకొండ నుంచి పర్మిట్ లేకుండా అక్రమంగా తరలిస్తున్న మూడు లారీలను శనివారం విజిలెన్స్ ఏడీ వీరేష్ అదుపులోకి తీసుకున్నారు. ఈర్లకొండ నుంచి మల్లాయపాలెం, వేమవరం జంక్షన్ మీదుగా మార్టూరు వైపు వెళ్తుండగా జంక్షన్లో అదుపులోకి తీసుకొని మార్టూరు పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. పర్మిట్ లేకుండా గ్రానైట్ మీటర్ రాళ్లు, స్లాబులు తరలించటం చట్టరీత్యా నేరమని, ఎంతటి వారిపై నైనా కేసులు నమోదుతో పెనాల్టీ తప్పదని వీరేష్ హెచ్చరించారు.

గులాబీ రంగు పురుగుతో పత్తికి నష్టం



లింగాకర్షక బుట్టలు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారులు

మార్టూరు: పత్తి పంటను ఆశించే గులాబీరంగు పురుగు వలన దిగుబడులు తగ్గే అవకాశం ఉందని తొలి దశలోనే రైతులు గుర్తించి నివారించుకోవాలని బాపట్ల వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరక్టర్ విజయ నిర్మల అన్నారు. మార్టూరు, బల్లికురవ మండలం వేమవరం గ్రామాల్లో శనివారం పత్తి పంటలను పరిశీలించిన ఆమె స్థానిక రైతులతో మాట్లాడారు. గులాబిరంగు పురుగును గుడ్డు, లార్వా దశలోనే గుర్తించి వేపనూనె కషాయం లేదా వేపనూనె లేదా తేలికపాటి రసాయనాలు వాడి నివారించాలన్నారు. మొక్క నాటిన 120 రోజుల తరువాత మాత్రమే పత్తిపై సింథటిక్ పైరిత్రాయిడ్ మందులు వాడాలని తెలిపారు. లింగాకర్షక బుట్టలను వాడి పురుగులను ఏరి వేయాలన్నారు. ఈ సందర్భంగా 10 మంది రైతులకు లింగాకర్షక బుట్టలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు సురేఖవాణి, కిరణ్‌కుమార్, ఎస్‌పీపీ కుమార్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

చీరాల రూరల్: క్షయవ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని.. క్షయవ్యాధి నిర్మూలన ప్రోగ్రాం అధికారి టి. రమేష్‌బాబు అన్నారు. టీబీ యూనిట్ చీరాల ఆధ్వర్యంలో శనివారం సంతబజారు, భావనారుషి గుడి వద్ద క్షయవ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయవ్యాధిపై సంబంధిత అధికారులు తగిన సూచనలు, సలహాలను అందించారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా జ్వరం రెండు వారాలకు మించి రావడం, రెండు వారాలుగా దగ్గు, కళ్లె పడడం, శరీర బరువు తగ్గిపోవడం, ఆకలిగా లేకపోవడం వంటి లక్షణాలు ఉన్నట్లయితే సమీపంలోని ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఉన్న టీబీ యూనిట్‌కు వచ్చి ఉచితంగా అందించే వైద్య సేవలు అందుకోవాలని సూచించారు. శ్రీలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ 'జగనన్న ఆరోగ్య సురక్ష'



కొప్పరపాలెంలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో సీహెచ్ కృష్ణ



కారంచేడులో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

కారంచేడు: ప్రతి ఇంట్లో వ్యక్తులకు అవసరమైన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం వర్తింపజేస్తారని ఎంపీడీవో డీ విజయలక్ష్మి అన్నారు. శనివారం ఆమె స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో నిర్వహించిన వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, సీహెచ్ఓల సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో ఐదు దశల్లో జరగనున్న కార్యక్రమంలో ప్రతి ఇంటినీ గ్రామ వలంటీర్లు సందర్శిస్తారన్నారు. అనంతరం ఏఎన్ఎం బృందం సందర్శించి ఇంట్లో ప్రతి ఒక్కరి నుంచి ఆరోగ్య వివరాలను సేకరించి నమోదు చేస్తారన్నారు. వలంటీర్లు, గృహసారథులు, స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా సందర్శిస్తారన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు ఎస్ వెంకటరత్నం, డీటీ సుశీల, ఈఓపీఆర్డీ రమేష్ బాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

బల్లికురవ: ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే గ్రామాల వారీగా పకడ్బందీగా పూర్తి చేసి అనారోగ్యంతో ఉన్న వారిని గుర్తించాలని ఎంపీడీవో సీహెచ్ కృష్ణ కోరారు. కొప్పరపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. సర్వే తదుపరి ఈ నెలాఖరు నుంచి అక్టోబరు 30 వరకు వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వివరించారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన బాలికలు



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన కేజీబీవీ బాలికలు

బల్లికురవ: స్కూల్ గేమ్స్‌లో మండల, నియోజకవర్గ స్థాయిలో సత్తా చాటి జిల్లాస్థాయి పోటీలకు బల్లికురవ కస్తూరిబా గాంధీ గురుకుల బాలికల విద్యాలయ బాలికలు ఎంపికయ్యారు. శనివారం కళాశాలలో విజేతలైన బాలికలను అభినందించారు. మండల స్థాయిలో ఉప్పమాగులూరు, నియోజకవర్గస్థాయిలో అద్దంకి లోని కాకానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో 1500 మీటర్ల రన్నింగ్‌లో జీ రాజేశ్వరి మొదటి స్థానం 600 మీటర్ల రన్నింగ్‌లో డీ కోమలి రెండో స్థానాన్ని సాధించింది. యోగాలో కే హేమలత మొదటి స్థానాన్ని, కే చంద్రిక రెండో స్థానాన్ని, కబడ్డీ అండర్-17లో ఏ లక్ష్మి ప్రసన్న, జీ రాజేశ్వరి, జే వీక్షిత, డిస్కస్ త్రోలో భూమిక, విజేతలుగా నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ బోనా సరళకుమారి, పీఈటీ కే స్వర్ణలత తెలిపారు. జిల్లా రైతు అధ్యక్షుడు, మండల పార్టీ అధ్యక్షుడు చింతల పేరయ్య, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, ఎంపీటీసీ చింతల అంజలీ శ్రీనివాస్, ఎంపీడీవో సీహెచ్ కృష్ణ, తహశీల్దార్ కే రవిబాబు, ఎంఈవో 1,2 వస్త్రం నాయక్, రమేశ్‌బాబు విద్యార్థులను అభినందించారు.

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

ఇంకొల్లు (చినగంజాం): వినాయక చవితి సందర్భంగా ఇంకొల్లు సర్కిల్ పరిధిలోని ఇంకొల్లు, కారంచేడు, చినగంజాం మండలాల్లో పందిళ్లు, మండపాలు ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహించే వారు తప్పనిసరిగా ఆయా పోలీస్ స్టేషన్‌పరిధిలోని స్టేషన్ హౌస్ ఆఫీసర్ అనుమతి పొందాలని సీఐ వీ సూర్యనారాయణ తెలిపారు. శనివారం ఆయన మండపాలు ఏర్పాటు చేసే వారు పాటించాల్సిన నియమ నిబంధనలు, ముందస్తు జాగ్రత్తల గురించి వివరించారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లా వాలీబాల్ జట్ల ఎంపిక పూర్తి



బూదవాడ గ్రామంలో ఎంపికలో పాల్గొన్న క్రీడాకారులు

జే.పంగులూరు: ఉమ్మడి ప్రకాశం జిల్లా వాలీబాల్ జట్ల ఎంపిక శనివారం మండల పరిధిలోని బూదవాడ జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించారు. ఈ ఎంపిక కార్యక్రమం పాఠశాల హెచ్ఎం బంగారుకొండ, పీడీ వెంకట్రావు ఆధ్వర్యంలో జరిగింది. 12 నియోజకవర్గాల నుంచి 400 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అండర్-17, అండర్-14 విభాగాల్లో బాలబాలికలకు సంబంధించిన నాలుగు జట్లను ఎంపిక చేసినట్లు ఎస్‌ఏపీఈ అసోసియేషన్ సెక్రటరీ నత్తన కృష్ణ, సభ్యులు వేణుగోపాల్ వెంకట్రావు తెలిపారు.

క్రీడాకారుల ఎంపికను పీడీలు స్వరూపారాణి, శేషగిరి, రమేష్, సుబ్బలక్ష్మి, వెంకట్రావు ఎంపిక చేశారు. జట్టుకు 16 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు చెప్పారు.